క్లుప్తంగా

వైభవంగా రథోత్సవం



చారకొండ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో కనకదుర్గ మాత దేవాలయంలో శుక్రవారం తెల్లవారుజామున పూల రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రథాన్ని ఆలయం చుట్టూ ఊరేగించారు. దుర్గమాత దేవాలయాన్ని మండలంలోని నాయకులు, అధికారులు స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. కేశమోని అంజయ్య అలివేల దంపతులు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ నారోజు పార్థసారథి, నారోజు రవి చారి, మట్ట వెంకటయ్య గౌడ్, అంజనేయులు గౌడ్, రామస్వామి, యాదయ్య గౌడ్, బాలచ్చి, జనార్దన్ రెడ్డి, భక్తులు తదితరులు ఉన్నారు.

డీటీడీఓ విచారణ

బల్మూర్: మండలంలోని కొండనాగుల ఎస్టీ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం డీటీడీఓ ఫిరంగి తనిఖీ చేశారు. శివరాత్రికి హాస్టల్ విద్యార్థులు సమీపంలోని దేవాలయంలో భోజనాలు చేశారని, హాస్టల్‌లో భోజనం వడ్డించలేదని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన విచారణ చేపట్టారు. శివరాత్రి రోజు హాస్టల్‌లో విద్యార్థులకు భోజనాలు వడ్డించారని కొంత మంది మాత్రమే ఆలయంలో భోజనాలు చేసినట్లు విచారణలో తెలిసింది. ఈ విషయాన్ని కలెక్టర్‌కు నివేదించనున్నట్లు డీటీడీఓ తెలిపారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

చారకొండ: మండలంలోని జూపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు సమాచార హక్కు చట్టం రక్షణ సమితి ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర కిషన్ నాయక్ మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో పట్టుదలతో చదువుకొని వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఝాన్సీరాణి, సమాచార హక్కు చట్ట రక్షణ సమితి ప్రధాన కార్యదర్శి అజీమ్, కార్యదర్శి యాదగిరి, కోశాధికారి ఆనంద్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

అమ్రాబాద్: పదర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు సమాచార హక్కు చట్టం రక్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కుర్ర కిషన్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలి



నాగర్‌కర్నూల్: ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లో యూఐడీఏ అసిస్టెంట్ మేనేజర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ వివిధ శాఖలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన శిశువు మొదలుకొని ఐదేళ్ల చిన్నారులందరికీ తప్పనిసరిగా తల్లిదండ్రులు ఆధార్ నమోదు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అప్‌డేట్ కోసం ఆధార్ శిబిరాలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో యుఐఏడీఐ అసిస్టెంట్ మేనేజర్ సత్య కళ, సెక్షన్ సూపరింటెండెంట్ శోభ, సీనియర్ అసిస్టెంట్ నజీర్, నరేష్, శివ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై సమీక్ష



ఊర్కొండ: మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద ఉపాధిహామీ పనులపై 2023– 24 సంవత్సరంలో చేపట్టిన పనులపై శుక్రవారం ప్రజావేదిక సమీక్షా సమావేశం నిర్వహించారు. అడిషనల్ డీఆర్‌డీఓ రాజేశ్వరి, ఏపీడీ చంద్రశేఖర్, మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, వివిధ గ్రామాల ప్రజల సమక్షంలో సమీక్షా నిర్వహించి వివరాలు వెల్లడించారు. అనంతరం అడిషనల్ డీఆర్‌డీఓ మాట్లాడుతూ ఈజీఎస్ పనులు పూర్తి స్థాయిలో చేపట్టాలన్నారు. ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ లక్ష్మణ్ నాయక్, ఏపీఓ నర్సింహులు, కార్యదర్శులు, క్షేత్ర పరిశీలకులు, కూలీలు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన

కొల్లాపూర్: మండలంలోని ఎల్లూరు ఎంపీపీఎస్ స్కూల్‌లో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.

గ్రంథాలయ పుస్తకాలకు చెదలు

- రెగ్యులర్ లైబ్రేరియన్ లేక ఇబ్బందులు

ఉప్పునుంతల: మండల కేంద్రంలో ఉన్న శాఖా గ్రంథాలయానికి ఏళ్ల తరబడిగా రెగ్యులర్ లైబ్రేరియన్ లేకపోవడంతో పుస్తకాలకు చెదలు పడుతున్నాయి. పాఠకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని నెలలుగా పుస్తకాలు బయటకు తీయకపోవడంతో దుమ్ము, ధూళితో దర్శనమిస్తున్నాయి. పదేళ్లకు పైబడి ఈ పరిస్థితి నెలకొన్నా పాలకులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో పాఠకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్ స్థానికుడు అచ్చంపేట వాసి కావడంతో ఇప్పటికైనా తమ గ్రంథాలయం సమస్య తీరుతుందని పాఠకులు, యువకులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. లైబ్రేరియన్ లేకపోవడంతో పుస్తకాల గదికి ఎప్పుడు చూసినా తాళం వేసి ఉంటుంది. అక్కడకు వచ్చే ఒకటి రెండు దిన పత్రికలకు మాత్రమే పరిమితం కావడంతో ఉదయం పూట కొంతమంది యువకులు ఆవరణలో కూర్చొని పత్రికలను చూసి వెళ్లే పరిస్థితి ఏళ్లుగా కొనసాగుతుండేది.. పోటీ పరీక్షలకు ఉపయోగపడే వార, మాస పత్రికలు ఏమాత్రం అందుబాటులో ఉంచడం లేదని విద్యార్థులు, యువకులు ఆవేదన చెందుతున్నారు.

రెండు వేలకు పైగా పుస్తకాలు..

ఈ గ్రంథాలయంలో మహనీయులకు సంబంధించిన పుస్తకాలతోపాటు మహాభారతం, పంచతంత్రం, విశ్వరహస్యం వంటి వివిధ రకాలైన 2 వేలకు పైబడి పుస్తకాలు ఉన్నా ఎవ్వరికీ ఉపయోగ పడటం లేదు. తమకు చదువుకోవాలని ఉన్నా లైబ్రేరియన్ లేక పుస్తకాలు ఉన్న గదికి తాళం వేసి ఉంచడంతో చదవలేక పోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒకటి, రెండు రోజులు మాత్రమే..

అచ్చంపేట లైబ్రేరియన్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడంతో ఆమె నెలలో ఒకటి రెండు పర్యాయాలు మాత్రం ఇక్కడకు వచ్చి వెళ్తోంది. కేవలం పేపర్ బిల్లులు ఇవ్వడానికి మాత్రమే ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ వచ్చి వెళ్తుండటంతో పుస్తకాలు చదువుకునే వీలులేకుండా పోయింది. ఇప్పటికే చాలా పుస్తకాలు పాడు కావడంతో వాటిని మూలన పడేశారు.



ఉప్పునుంతల శాఖా గ్రంథాలయం

లైబ్రేరియన్‌ను నియమించాలి

రెగ్యులర్ లైబ్రేరియన్ నియమించాలి. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. కొన్నేళ్లుగా గ్రంథాలయంలో పుస్తకాలను ఇంటికి తీసుకొని చదువుకునే వీలులేకుండా పోయింది. గ్రంథాలయం ఎవరికీ ఉపయోగపడటంలేదు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా ఫలితంలేదు.

– అనుపటి నాగరాజు, పాఠకుడు, ఉప్పునుంతల

పూర్తిస్థాయిలో రైతు భరోసా ఇవ్వాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: అర్హులపై రైతులందరికీ పూర్తిస్థాయిలో రైతు భరోసా ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర సంఘం సహాయ కార్యదర్శి వార్ల వెంకటయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మణాచారి భవనంలో రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్ల వెంకటయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఎకరాలకు రూ.12 వేలు ఇవ్వడం సరికాదన్నారు. కాలయాపన చేయకుండా వెంటనే అందరికీ రైతుల ఖాతాలో పంట పెట్టుబడి సాయం జమ చేయాలని కోరారు. ఎండు మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కృష్ణాజీ, బాలమురళి, కే కేశవులు గౌడ్, కొంగరి శ్రీనివాసులు, ఎల్లయ్య, వెంకటస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వార్ల వెంకటయ్య

హోటల్ నిర్వాహకులపై చర్య తీసుకోవాలని వినతి



నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణం కేంద్రంలో ఉన్న హిమాలయ హోటల్‌పై చర్య తీసుకోవాలని మాదిగ జేఏసీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ వంగూరి జయశంకర్ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఉన్నరోడ్డును కబ్జా చేసి పార్కింగ్‌కు వాడుకుంటున్నారని, హోటల్ వెనుక భాగంలో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని వినతిలో పేర్కొన్నారు. కన్నోజు సతీష్, నరసింహరావు, శ్యామ్‌ప్రసాద్ గౌడ్, శ్రీరాములు, ఆనంద్, పాదాల శివ, సతీష్‌కుమార్, శరత్, నిజాముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: పాఠశాలలు పూర్తి కాకముందే ముందస్తుగా అడ్మిషన్ల కోసం విద్యార్థులను ఒత్తిడి చేస్తున్న కార్పొరేట్ కళాశాలల యజమానులపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం డీఐఈఓతో పాటు డీఈఓకు ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రాలు అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం చేస్తున్నారని వివరించారు. జిల్లా నాయకులు అరవింద్, మధుగౌడ్, ప్రేమ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీ పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డులలో పారిశుద్ధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. కాలనీలలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఎలా ఇవ్వాలో కాలనీవాసులకు వివరించారు. మురుగును తొలగించిన వెంటనే అక్కడ బ్లీచింగ్ చల్లటంతో పాటుగా, వెంటనే మురుగును ఎత్తిపోయాలని సిబ్బంది సూచించారు. నీటి ట్యాంకులను శుభ్రంగా ఉంచాలన్నారు. కమిషనర్ వెంట ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ శివ, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన



లింగాల: మండలంలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కమ్యూనిటీ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. అనంతరం హెడ్‌కానిస్టేబుల్ వెంకటేష్ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం చెప్పొద్దన్నారు. ఫోన్లలో వచ్చే పెట్టుబడుల వ్యాపారాలను నమ్మి మోసపోద్దన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పాఠశాల తనిఖీ చేసిన ఎంఈఓ

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని గచ్చుబావి రోడ్డులో ప్రాథమిక పాఠశాలను కల్వకుర్తి ఎంఈఓ శంకర్ నాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులతో పనులు చేయిస్తున్నారన్న సమాచారంతో పాఠశాలను తనిఖీ చేసినట్లుగా ఆయన తెలిపారు. మధ్యాహ్న భోజనం, రికార్డులను ఆయన పరిశీలించారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం




తెలకపల్లి విద్యార్థులు ప్రదర్శిస్తున్న పరికరాలను తిలకిస్తున్న డీఈఓ రమేష్



నాగర్‌కర్నూల్‌లో ..

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. పలు పాఠశాలల్లో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల సైన్స్ ఉపకరణాలను ప్రదర్శనగా ఉంచారు. తెలకపల్లి, బల్మూరులో డీఈఓ రమేష్‌కుమార్ విద్యార్థుల ప్రదర్శనలను తిలకించి మాట్లాడారు. సైన్స్‌తోనే సర్వ మానవాళి ముడిపడి ఉందని, సైన్స సంబంధించిన సామగ్రి, వాటిని ఉపయోగించే తీరు, వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. నాగర్‌కర్నూల్‌లో ఏఎంఒ షర్ఫుద్దీన్ హాజరయ్యారు. కొల్లాపూర్, తాడూరు, కల్వకుర్తి, వెల్దండ, పెద్దకొత్తపల్లి, ఉప్పునుంతల, బల్మూర్, తిమ్మాజిపేట, కోడేరు, వెల్దండ, చారకొండ, లింగాల పాఠశాలలో విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఎంఈఓలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసులు, శంకర్ నాయక్, బషీర్ అహ్మద్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



కోడేరులో..



తాడూరులో..

సీఎంను కలిసిన ఎమ్మెల్యే



నాగర్‌కర్నూల్: హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో శుక్రవారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. పట్టణంలో నూతన జూనియర్ కాలేజీ భవనం, నూతన బస్ స్టాండ్ ఏర్పాటు, కొత్త ఆర్అండ్‌బీ రోడ్ల మంజూరు, తదితర అభివృద్ధి పనులను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. అదేవిధంగా మార్చి నెలలో నాగర్ కర్నూలు నియోజకవర్గ పర్యటనకు రావాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం



తిమ్మాజిపేట: మండల కేంద్రంలో నాల్గో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ బహదూర్, లక్ష్మీనారాయణ, దానం బాల్‌రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. నాయకులు రవూఫ్, ముబారక్, లింగం, మనోహర్, శ్రీరాం, పాండు, మల్లేష్, పీఈటీ అరుణ, వెంకటేష్, నిర్వాహకులు సందీప్, విష్ణు, శ్రీకాంత్, నవీన్ క్రీడాకారులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి



తాడూరు: వసతి గృహాల పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని మండల నోడల్ అధికారి రామార్జున్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వసతి గృహాన్ని ఎంపీడీఓ ఆంజనేయులుతో కలిసి ఆయన పరిశీలించారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. నీటి వసతి, మూత్రశాల నిర్వహణ వంటి అంశాలను ఎంపీడీఓతో చర్చించారు.

రూ.4లక్షల చోరీ



ఊర్కొండ: మండలంలోని ముచ్చర్లపల్లి మాజీ సర్పంచ్ వీరేరెడ్డి పర్వత్ రెడ్డి స్వగృహంలో గురువారం రాత్రి చోరీ అయిన ఘటన చోటుచేసుకుంది. కానిస్టేబుల్ వెంకోజి తెలిపిన వివరాల ప్రకారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువును చూసేందుకు మాజీ సర్పంచ్ వెళ్లాడు. గుర్తుతెలియని వ్యక్తులు మాజీ సర్పంచ్ ఇంటిలోకి ప్రవేశించి ఇంట్లో ఉన్న బంగారం, వెండి ఆభరణాలతో పాటు రూ.4లక్షల నగదు ఎత్తుకెళ్లారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా శుక్రవారం ఘటన స్థలాన్ని కల్వకుర్తి సీఐ నాగార్జున పరిశీలించారు.

అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని సాయి లక్ష్మీవెంకటేశ్వర రెస్ట్ మిల్లులో ఈ నెల 22న జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్ ఆకస్మిక తనిఖీ చేసిన విషయం విధితమే. అదేసమయంలో నిల్వ ఉన్న బస్తాల గురించి, ఇచ్చిన ధాన్యం వివరాలను నమోదు చేసుకున్నారు. శుక్రవారం మరోసారి అదనపు కలెక్టర్ రైస్‌మిల్లును సందర్శించారు. ఈ మేరకు గతంలో నిర్వాహకులు చెప్పిన వివరాలకు ప్రస్తుతం ఉన్న బియ్యం బస్తాలను లెక్కించారు. పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ అధికారి శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం బస్తాలు లెక్కిస్తున్న అధికారులు

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

లింగాల: వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రార్థన సమయానికి రావాలని సూచించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను మెరుగుపర్చాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. ప్రతి విద్యార్థి అపార్ ఐడీని తప్పని సరిగా జనరేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుశీలమ్మ, ఉపాధ్యాయులు శంకర్, జ్యోతి, మంజులత, జులేఖ బేగం పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల బోధనను పరిశీలిస్తున్న ఎంఈఓ

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

బల్మూర్: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా విద్యాధికారి రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పదో తరగతి–ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చి తమ తల్లిదండ్రులు, గురువులకు పేరు ప్రఖ్యాతలు తెచ్చి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థుల నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో కేజీబీవీ జిల్లా కోఆర్డినేటర్ శోభారాణి, ఇన్‌చార్జ్ ఎంఈఓ విష్ణుమూర్తి, ఎస్ఓ లలిత, వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత బస్ సౌకర్యం కల్పించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదరిశ తారాసింగ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇంటర్ విద్యార్థులకు ఉచిత బస్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, యశ్వంత్, మహేష్, భానుచందర్, శ్రీకాంత్, చరణ్ తేజ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు క్లీనింగ్ మిషన్ ప్రారంభం

వెల్దండ: మండల కేంద్రంలో రోడ్డు క్లీనింగ్ మిషన్‌ను శుక్రవారం ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామంలో రోడ్లను శుభ్రం చేసేందుకు వైఎంఆర్‌స్టోన్ క్రషర్ సహకారంతో దాదాపుగా రూ.3 లక్షల విలువతో కూడిన రోడ్డు క్లీనింగ్ మిషన్ గ్రామ పంచాయతీకి అందజేశారు. అనంతరం రోడ్ల శుభ్రం చేశారు. మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడు, కార్యదర్శి గిరి, నాయకులు శిఖపాల్‌రెడ్డి, ఎర్రశ్రీనుముదిరాజ్, తిరుపతిరెడ్డి, పురుషోత్తంచారి, భరత్‌గౌడు, తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు



తెలకపల్లి: మండల కేంద్రంలోని భైరవకోన దుర్గదేవి అమ్మవారికి శుక్రవారం బోనాలు నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ వీధిలో ఉన్న దేవాలయంలో ప్రధాన అర్చకుడు ఉమాపతి ఆచార్యుల ఆధ్వర్యంలో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లారు.

ట్రాక్టర్ ఢీ విద్యార్థికి తీవ్ర గాయాలు

తిమ్మాజిపేట: ట్రాక్టర్ ఢీకొని విద్యార్థికి తీవ్రగాయాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల వివరాల ప్రకారం ఈ నెల 25 మండల కేంద్రంలో ఓ మైనర్ బాలుడు ట్రాక్టర్ నడిపుతూ విద్యార్థి నందకుమార్‌ను ఢీకొన్నాడు. విద్యార్థికి బలమైన గాయాలు కావడంతో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

గొర్రెలు చోరీ

తెలకపల్లి: మండలంలో గొర్రెలు చోరీ జరిగినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. వివరాలు.. చిన్నముద్దునూరుకి చెందిన వేమిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి గ్రామ శివారులోని పొలంలో ఒక షెడ్డును నిర్మించి, అందులో 110 గొర్రెలను కాస్తున్నాడు. వాటి సంరక్షణ కోసం నిత్యం ఇద్దరు వ్యక్తులతో కాపలా ఉంచాడు. రోజు మాదిరిగానే గురువారం సాయంత్రం కాపలాదారులు 110 గొర్రెలను షెడ్‌లో ఉంచి సొంత పని మీద ఇంటికొచ్చారు. శుక్రవారం ఉదయం ఆరు గంటలకు షెడ్‌కు వెళ్లిచూడగా 10 గొర్రెలను గుర్తుతెలియని దుండగులు దొంగిలించారు. చుట్టు పక్కల వెతికినా గొర్రెల ఆచూకీ లభించలేదు. గొర్రెల విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని బాధితుడు రాజేష్‌రెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అంబులెన్స్ ప్రారంభం

మన్ననూర్: మన్ననూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కొత్తగా సమకూర్చిన 108 అంబులెన్స్ వాహనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ డిప్యూటీ డీఎండీహెచ్ఓ తారాసింగ్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అంబులెన్స్ ప్రాధాన్యం గురించి వివరించారు. పీహెచ్‌సి పరిధిలో అనేక చెంచు పెంటలు, గ్రామాలు ప్రజల సౌకర్యార్థం ఎమ్మెల్యే నిధులతో అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఆస్పత్రి నిర్వహణ కోసం అవసరమైన బోరు మోటరును ప్రారంభించారు. అనంతరం సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త మేడ లింగయ్య వారం రోజుల కిందట మృతిచెందాడు. ఈ మేరకు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. వైద్యాధికారి సుధాకర్, హెచ్ఓ హరి నాయక్, శ్రీకాంత్, జగన్, వైద్య సిబ్బంది, నాయకులు హరినారాయణ, శ్రీనివాసులు,రవి, తులనాయక్, రాజారాం, శివాజీ, పాండు, బాలు, యశ్వంత్, శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

మన్ననూర్/అమ్రాబాద్: ఉమ్మడి అమ్రాబాద్ మండలంలోని రాయలగండి క్షేత్రంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు, పనులను ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ శుక్రవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మార్చి 3వ తేదీ నుంచి 6వ తేదీ నాలుగు రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఆలయ కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆలయంలోని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

బైక్‌ల చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బైక్‌లను చోరీ చేసిన వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం ఉదయం 6 గంటల సమయంలో అనుమానస్పదంగా బైక్‌పై ఓ వ్యక్తి తాడూరు పెట్రోల్ బంక్ దగ్గర కనిపించాడు. అతడిని విచారించగా నాగర్‌కర్నూల్ మండలం గన్యాగుల చెందిన రాముడుగా గుర్తించారు. నిందితుడు గతంలో కల్వకుర్తి, గద్వాల, కొత్తూరు, మీర్‌పేట్, వనస్థలిపురం, పెద్దకొత్తపల్లి, అమన్‌గల్, కడ్తల్ ఏరియాలలో బైక్‌లను దొంగిలించి జైలుకు వెళ్లివచ్చినట్లు పేర్కొన్నారు. 27న అర్ధరాత్రి మండల కేంద్రంలోని వసుపరి మల్లయ్య ఇంటిముందు నిలిపిన బైక్‌ను చోరీ చేసినట్లు పేర్కొన్నారు. వారం రోజుల కిందట జిల్లా పరిధిలో, జడ్చర్ల పరిధిలో రెండు బైక్‌లను చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి మూడు బైక్‌లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడులు

లింగాల: మండలంలోని కొత్తకుంటపల్లిలో శుక్రవారం కోడి పందేల స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని దర్గా దగ్గర కోడి పందాలు ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. కొంత మంది పరార్ కాగా అవుసలికుంట గ్రామానికి చెందిన శ్రీశైలం, కొత్తకుంటపల్లికి చెందిన అబ్బయ్యల నుంచి రెండు పందెం కోళ్లు, రూ.1,000 నగదును స్వాధీన పర్చుకుని కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్సీ కవితకు ఘన స్వాగతం

కల్వకుర్తి రూరల్/కోడేరు/పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్‌కు వెళ్తున్న తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత శుక్రవారం మార్గమధ్యలో కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా కోడేరులో సింగోటం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. పెద్దకొత్తపల్లి మండలం ఆదిరాలలో బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్సీ కవితను సన్మానించారు. ఆమె వెంట ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.